సమస్యల పరిష్కారం కోసమే.. ప్రజావాణి

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, అధికారులు
- ఇక నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి

సికింద్రాబాద్ / బేగంపేట, జనవరి 8: సమస్యల పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా రెడ్డి అన్నారు. సోమవారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె జోనల్ కమిషనర్ రవికిరణ్,డీసీ సుధాంష్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించడానికి దోహదం చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ఇక నుంచి ప్రతి సోమవారం ఉంటుందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు.

ప్రజావాణి కార్యక్రమంలో అధికారులతో మాట్లాడుతున్న బేగంపేట్ సర్కిల్ డీసీ శంకరయ్య

ప్రజా వాణికి స్పందన కరువు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావాణి కార్యక్రమానికి సికింద్రాబాద్ మున్సిపల్ జోనల్ కార్యాలయంలో స్పందన కరువైంది. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మున్సిపల్ డివిజన్ల నుంచి కేవలం మూడే దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. మొదటగా జనన ధృవీకరణ పత్రం కావాలని స్థానికుడు సతీష్ దరఖాస్తు చేసుకోగా అప్పటికప్పుడే ఆ సమస్యను పరిష్కరించామన్నారు. అలాగే, రాంగోపాల్‌పేటకు చెందిన శ్రీనివాస్ అక్రమ నిర్మాణంపై అధికారులు ఫిర్యాదు చేశారు. మల్కాజిగిరికి చెందిన మరొకరు భారతి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఫిర్యాదు చేశారు. ఆయా దరఖాస్తులపై విచారణ చేపడుతామని జోనల్ కమిషనర్ రవికిరణ్ తెలిపారు.

సర్కిల్ కార్యాలయంలో..

సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదని అధికారులు తెలిపారు.

బేగంపేట్ సర్కిల్ లో ..

ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం బేగంపేట్ సర్కిల్ కార్యాలయంలో ప్రారంభించారు. బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య ఆధ్వర్యంలో మారేడ్‌పల్లిలోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాయలంలోని మూడో అంతస్తులో ఉన్న బేగంపేట్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమైంది. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎలాంటి దరఖాస్తులు రాలేదని సర్కిల్ ఉప కమిషనర్ తెలిపారు. అదేవిధంగా ప్రజావాణి కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు.

సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులతో చర్చిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి

మాట్లాడుతున్న ప్రొఫెసర్ వినోద్‌కుమార్

పదవుల్లో సామాజిక న్యాయం ఏదీ ?

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కీలకమైన అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ పదవులు రెండూ రెడ్డి సామాజిక వర్గానికే ఇస్తే.. సామాజిక న్యాయం ఎలా పాటించినట్లు అవుతుందని ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ లా మాజీ డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ప్రశ్నించారు. తార్నాకలోని తన నివాసంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని పదవుల్లో సామాజిక న్యాయం పాటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరి పల్లవి మోడల్ స్కూల్‌లో మొదటి వార్షికోత్సవ(నయోనోత్సవ్) వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, అగ్రికల్చర్ యూనివర్సిటీ మాజీ డీన్ విజయ ఖాదర్,విద్యా సంస్థల చైర్మన్ మల్కా కొమురయ్య,నోబల్ డైరెక్టర్ కార్తీక్,అకడమిక్ డైరెక్టర్ సుధ హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక,నాటక,సాహిత్య నైపుణ్యాలను ప్రదర్శించారు. - బొల్లారం, జనవరి 8

ఘనంగా అయ్యప్ప పడిపూజ

బీకేగూడలోని జీ బిల్డింగ్‌లో ఎస్ఆర్ నగర్‌కు చెందిన కాసాని సహదేవ్ గౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్పస్వామి పడి పూజను ఘనంగా నిర్వహించారు.

- అమీర్‌పేట్, జనవరి 8

పనిచేస్తున్న ఇంట్లోనే చోరీ

బేగంపేట్ జనవరి 8: పని చేస్తున్న ఇంట్లోనే ఓ మహిళ నగదు దొంగతనం చేసి పోలీసులకు పట్టుపడింది. బేగంపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేట్‌లోని ది విండర్స్ అపార్ట్‌మెంట్‌లో నివసించే కే.అవంతి తన ఇంట్లో బీరువాలో నుంచి తరచు నగదు మాయమవుతుంది. వారికి అనుమానం వచ్చి ఇంట్లో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా ఇంట్లో పని చేస్తున్న మహిళనే ఆ నగదును చోరీ చేస్తున్నట్లు గుర్తించారు. అక్టోబర్ 2022 నుంచి జనవరి 2023 వరకు మొత్తం లక్షా 80 వేల నగదు చోరీకి గురైంది. దీంతో అవంతి సోమవారం బేగంపేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల దర్యాప్తులో చోరీ చేసినట్టు సదరు మహిళ ఒప్పుకుంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మురళి మృతి పార్టీకి తీరనిలోటు

సికింద్రాబాద్, జనవరి 8 : బౌద్ధనగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మురళి మృతి పార్టీకి తీరని లోటు అని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మురళి తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

దర్జీల సమస్యలు పరిష్కరిస్తాం

మల్కాజిగిరి, జనవరి 8: దర్జీల సమస్యలు పరిష్కరిస్తామని అల్వాల్ సర్కిల్ మేరు సంఘం అధ్యక్షుడు రాపర్తి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మేరు సంఘం తెలంగాణ జోన్ 11 అల్వాల్ సర్కిల్ అధ్యక్షుడిగా రాపర్తి చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, బాలయ్య, కొండయ్య, భిక్షపతి, కీర్తి, సుధాకర్, గణేశ్, కరణ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఉప్పల్, జనవరి 8 : చిలుకానగర్ డివిజన్‌లోని శ్రీనగర్‌కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ పరిశీలించారు. ఈ మేరకు పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్‌కుమార్, నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, జగన్, శ్రీనివాస్, చేర్యాల శ్రీనివాస్, మహమూద్, శ్యామ్, బాలు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు శుభాకాంక్షలు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హిమాయత్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సోమవారం సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. - సికింద్రాబాద్, జనవరి 8

'అభయహస్తం' దరఖాస్తులు

ఆన్‌లైన్ నమోదు ప్రారంభం

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

బేగంపేట్ జనవరి 8: ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం కోసం స్వీకరించిన దరఖాస్తులను సోమవారం నుంచి సర్కిల్ అధికారులు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయించి యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నట్టు డీసీ శంకరయ్య తెలిపారు. సంక్రాంతి పండుగ వరకు ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ సిబ్బందికి చీరలు పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న ఖైరతాబాద్ ఏఎంహోహెచ్ డాక్టర్ ప్రవీణ

అమీర్‌పేట్, జనవరి 8: సంక్రాంతిని పురస్కరించుకుని జెక్ కాలనీలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది, కాలనీ అపార్ట్‌మెంట్లలో కాపలాదారులుగా ఉంటున్న మహిళలకు చీరలు, రగ్గులు, రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. కాలనీలోని విజయ్ గ్రాండ్యూర్ అపార్ట్‌మెంట్స్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ ఏఎంహోహెచ్ డాక్టర్ ప్రవీణ, కాలనీ అధ్యక్షులు డాక్టర్ మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డీఆర్ఎస్ చందులు హాజరై పంపిణీ చేశారు.అనంతరం దాతలు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ, హైమావతి ప్రసాద్, హరిత, కృష్ణకుమారి, సుమ, విజయలక్ష్మిలను అభినందించారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ గణేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గణేశ్‌కు ఏబీవీపీ నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి పది నెలల మెస్ బిల్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

- విద్యార్థుల బోనఫైడ్ సర్టిఫికెట్ కోసం చెల్లించాల్సిన ఫీజును తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థినులకు తరగతి గది సమయానికి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
- విద్యార్థుల హాస్టళ్లను వారంలో ఒక రోజు అధికారులు తనిఖీ చేయాలన్నారు.
- ఆర్ట్స్ కళాశాల నుంచి సెంటెనరీ హాస్టల్ వరకు లైట్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ఆగంతకుల నుంచి రక్షణ కోసం సెక్యూరిటీ గార్డును నియమించాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఎమ్మెల్యే పద్మారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ సక్కుబాయి

సికింద్రాబాద్, జనవరి 8: పేదలకు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్యం అందించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సక్కుబాయి నేతృత్వంలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సోమవారం ఎమ్మెల్యేను సీతాఫల్‌మండి కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతను కల్పిస్తున్నామన్నారు.



క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారురాలికి ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే లాస్యనందిత

పేదలకు వరం 'సీఎంఆర్ఎఫ్'

కంటోన్మెంట్, జనవరి 8: పేదలు అత్యవసర చికిత్స పొందేందుకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతున్నదని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత తెలిపారు. నియోజకవర్గంలోని ఏడో వార్డుకు చెందిన శ్రీదేవి కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతుంది. ఈ క్రమంలో వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే లాస్యనందిత దృష్టికి తీసుకురాగా సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. దీంతో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1లక్ష ఎల్వోసీని సోమవారం కార్ఖానాలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని పేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కేబీ శంకర్ రావు ఉన్నారు.

చెస్‌తో.. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం

చెస్ చాలా తెలివైన ఆట అని బేగంపేట్ చెస్ స్కూల్ చిన్నారుల్లో విశేష ప్రతిభ ఉందని రష్యన్ చెస్ క్రీడాకారుడు సూపర్ గ్రాండ్ మాస్టర్ సెర్జి తివియాకోవ్ అన్నారు. సోమవారం బేగంపేట్‌లోని చెస్ స్కూల్‌లో చిన్నారులకు మెళకువలు నేర్పించారు. భారతీయులు కనిపెట్టిన చెస్ క్రీడా ప్రపంచంలో తెలివైన ఆటగా ప్రసిద్ధికెక్కిందన్నారు.అదే విధంగా చెస్‌తో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. చిన్నారుల విభాగంలో చెస్ స్కూల్ క్రీడాకారులు అమయ, ఆనయ ఇంటర్నేషనల్ చాంపియన్స్‌గా నిలవడం చాలా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈవో కోచ్ సందీప్ నాయుడు, భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

- బేగంపేట్, జనవరి 8

దేవుని ఎదుట నాటకం

తెలుగు యూనివర్సిటీ, జనవరి 8: నాటక రచయిత ఆరుద్ర రచించిన దేవుని ఎదుట మాయాజాలం నాటక దర్శకుడు సమ్మెట వెంకటరమణ దర్శకత్వంలో తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం సీఏఎమ్మెస్ ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. ప్రత్యేకమైన రంగస్థల వేదికపై దేవుడి ఎదుట అంశంగా న్యాయస్థానం ఆధారంగా నాటకం సాగింది. కళాకారులను సన్మానించి వారి ప్రతిభను ప్రశంసించారు.

రేపు సిరిమువ్వ కల్చరల్ నాటకోత్సవం

తెలుగు యూనివర్సిటీ, జనవరి 8: సిరిమువ్వ కల్చరల్ ఆధ్వర్యంలో జనవరి 10న సాయంత్రం తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో సిరిమువ్వ కల్చరల్ నాటకోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి జి. పెరుమాళ్లు సోమవారం తెలిపారు. సాహితీ సూక్తం, హక్కు నాటికలు ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. ప్రముఖ రంగస్థల రచయిత గోపి సత్యప్రకాశ్‌కు భజరప్ప రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

'డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జైలుకే'

బేగంపేట్ జనవరి 8: డ్రైవింగ్ లైసెన్స్, నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. సోమవారం టీటీఐ ఆధ్వర్యంలో బేగంపేట్‌లోని బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందికి 'రోడ్డు ప్రమాదాలు- నివారణ' పై అవగాహన కల్పించారు. శంకర్‌రాజు మాట్లాడుతూ... 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడిపితే రూ 5వేల వరకు జరిమానా, 3 నెలల జైలు శిక్ష ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ అధికారులు చంద్రశేఖర్, అమర్ పాల్గొన్నారు.

బజాజ్ ఫైనాన్స్ ఆఫీస్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

శ్రీరాముడి అక్షింతలు పంపిణీ

ఆర్యవైశ్య సంఘం తుకారాంగేట్ అధ్యక్షుడు నాగబండి శ్రీకాంత్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీ రాముడి అక్షింతలను అడ్డగుట్ట తుకారాంగేట్ ప్రాంతాల్లో ఇంటింటికీ అందజేశారు. అంతకుముందు కొడారపు అశోక్ ఆధ్వర్యంలో కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శ్రీకాంత్, శ్రీనివాస్, వెంకటేష్, కందుకూరి గణేశ్, నాగబండి సుధాకర్, వీరేశ్, నర్సింగ్ రావు, సంఘం వైస్ చైర్మన్ కందుకూరి సాగర్‌బాబు పాల్గొన్నారు. - అడ్డగుట్ట, జనవరి 8

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, జనవరి 8: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం చర్లపల్లి- ఘటకేసర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాల కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి జేబులో దొరికిన గుర్తింపు కార్డు ఆధారంగా మృతుడు యాదాద్రి భువనగిరి జిల్లా, వడపర్తి గ్రామానికి చెందిన ఎలిమినేటి సాయినాథ్‌రెడ్డి, తండ్రి సురేష్‌రెడ్డి (29) ప్రైవేటు ఉద్యోగి అని పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు కబ్జాపై సీఈఓకు ఫిర్యాదు

కంటోన్మెంట్, జనవరి 8 : రెండో వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నామని బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం రెండో వార్డు ఇందిరమ్మ నగర్ రామాలయం ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా నిర్మాణం చేపట్టారన్నారు. తక్షణమే రోడ్డుకు అడ్డంగా నిర్మించిన దానిని తొలగించాలని బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు టీఎన్ శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో మందికి ఇబ్బందులు కలిగించే విధంగా కొందరు వ్యక్తులు రోడ్డును కబ్జా చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీంతో పాటు వార్డులోని డ్రైనేజీ సమస్య, సీసీ రోడ్ల వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్, బస్తీ కమిటీ అధ్యక్షుడు మంగల్ నగేశ్, మహేశ్, శ్యామ్‌రెడ్డి, స్వామి, రవి, నరేశ్, పాండునాయక్ పాల్గొన్నారు.

సీఈఓ మధుకర్‌నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్